**2004 ఆగష్టు 23వ తేదీ శ్రీకాకుళంజిల్లా భక్తుల పుట్టపర్తియాత్ర సందర్భంగా ఉదయం సాయికుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం**

# మానసిక శాంతికై నామస్మరణ చేయండి!

*నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై*
*హద్దును పద్దు లేక వ్యయమందగ జేయుచు జీవితంబు నీ*
*విద్దెల ధారవోసి అరవిందదళాక్షుని విస్మరించి ఏ*
*పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!*

ప్రేమస్వరూపులారా! కూటిపేద మొదలు కోటీశ్వరునివరకు ప్రతి ఒక్కరూ పొట్టను నింపుకోవటానికి ప్రయత్నించటం సహజమే! కాని ఆహారం కొరకు మీరు ఎంత కాలమును వినియోగిస్తున్నారో ఆ కాలములో ఒక్క క్షణమైనా దైవచింతనకు వినియోగించటం మీకు సాధ్యం కాదా? భగవంతుడు అందించిన కాలాన్ని భగవంతునికోసం వినియోగించి సార్థకము గావించుకునేవారుకూడా లేకపోలేదు ఈ భారతదేశంలో. ప్రేమస్వరూపులారా! శ్రీకాకుళం జిల్లానే కాకుండా ఇలాంటి జిల్లాలు భారత దేశంలో ఇంకా ఎన్నియో ఉన్నవి. అన్నిచోట్ల ప్రజలు వారివారి డొక్కలకోసమని రెక్కలాడించుకుంటూ ఎన్నో కర్మలు ఆచరిస్తున్నారు. కాని, ఎన్ని శ్రమలు పడినా వారు ఏమాత్రమైనా సుఖమునుగాని, శాంతినిగాని అనుభవిస్తున్నారా? లేదు. అయితే దైవచింతన చేసే మానవులకు మాత్రం ఏ కొద్దిపాటైనా మానసికశాంతి, శారీరకసుఖములు కలుగుచునే ఉన్నవి.

కాని ఎంతమందో కేవలం శారీరకమైన అనుకూలములను ఆశిస్తూ ఎన్నో బాధలకు గురియవుతున్నారు; కష్టములను అనుభవిస్తున్నారు. శారీరక సుఖమును, మానసికశాంతిని సంపూర్ణంగా అనుభవించటానికి ఈనాటివరకూ ఎవ్వరికీ సాధ్యం కాలేదు. శరీరమును చూస్తామా అంటే... ఇది కేవలం ఒకవిధమైన అంబులపొదివంటిది, నీటిబుడగవలె క్షణభంగురమైనది. ఇంక మనస్సును చూస్తామా అంటే..అది కేవలం ఒక పిచ్చికోతివంటిది; ఎప్పుడుకూడను చంచలత్వంతోనే కూడి ఉంటుంది. ఇట్టి చంచలమైన మనస్సునకు, అంబులపొదివంటి దేహమునకు సుఖమును ఇవ్వాలని ప్రయత్నించటం పొరపాటు. జీవించి ఉన్నంతవరకు ఎవ్వరికీ శ్రమ కలిగించకుండా తన దేహాన్ని తాను నిలబెట్టుకోవటం ప్రతి మానవుని కర్తవ్యం. తమ

sri sathyasai vachanamrutam

జీవితమంతటినీ శరీరముకొరకు మనస్సుకొరకు వినియోగించుకొనేవారు అనేకమంది ఉన్నారుగాని, ఈ రెండిటినీ ప్రక్కనపెట్టి శాంతిని అనుభవిస్తూ శారీరకసంబంధమైన ఆరోగ్యమును కనిపెట్టుకునేవారు చాలా అరుదు. మానవత్వము దివ్యత్వమును అనుభవించటానికి ఉద్భవించినటువంటిదేగాని, లౌకికమైన సుఖమును కోరే నిమిత్తం కాదు. భగవంతుడు ఈ శరీరమునిచ్చినది కేవలం ఉదరపోషణ నిమిత్తమని భావించరాదు.

మానవత్వంలో దేహతత్త్వము దివ్యమైనది, చాలా అద్భుతమైనది. ఇట్టి అద్భుతమైన దేహముతో మానవుడు చేయవలసిన కర్తవ్యకర్మలు ఎన్నియో ఉన్నవి. కాని, వాటిని చేయటం మానివేస్తున్నాడు. శారీరకంగా, మానసికంగా సంపూర్ణమైన ఆనందము ననుభవించటానికి ఎన్నియో కర్మలను ఆచరించాలి. అసలు ఈ పవిత్రమైన మానవజన్మ దేనికోసం వచ్చింది? జీవితమును సార్థకము గావించుకునే నిమిత్తం వచ్చింది. ఈ దేహము ఎటువంటిది? “మలినపుకొంప. రోగముల మ్రగ్గెడు సేవకగంప. జాత సంచలనము పొందు దుంప..” ఇటువంటి దేహముపై మనం అభిమానమును పెంచుకోకూడదు. దీని నిమిత్తమై మనం రాలేదు.

ఈ దేహముద్వారా మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చుకునే నిమిత్తం వచ్చాము. ఈ సత్యాన్ని మన అంతర్భావము నిరంతరం మనకు బోధిస్తూనే ఉన్నది. దివ్యత్వాన్ని అనుభవించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. అట్టి సార్థకత నిమిత్తమై దేహమును వినియోగించుకొనేవారు ఎందరో ఉంటున్నారు. కాని, సత్యాన్ని గుర్తించుకునే వ్యక్తులు చాలా తక్కువ. మనం ఎన్ని కర్మలను ఆచరించినప్పటికీ మానసికశాంతిని లక్ష్యంగా పెట్టుకోవాలి. మానసికశాంతి లేనినాడు ఎన్ని చేసినప్పటికీ అవన్నీ అశాంతినే అందిస్తాయి. శాంతి కించిత్తైనా లభించదు.

### మీకు సహాయం చేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను

ప్రేమస్వరూపులారా! మీరందరూ ఎన్నో అవస్థలకుగురై, ఆర్థిక ఇబ్బందులను కూడా లెక్కచేయక ఇక్కడికిరావటం నిజంగా మీ అదృష్టం. ఇట్టి ఆనందమునుపొందే నిమిత్తం మీరిక్కడకు వచ్చారనే సత్యాన్ని స్వామి మరువలేదు. నిన్న రాత్రివరకు కూడను ‘స్వామి మాతో ఒక్క పలుకైనా పలుకలేదు’ అని చాలామంది బాధపడుతూ వచ్చారు. ఆ ప్రార్థనలను పురస్కరించుకొనియే ఈనాడు తెల్లవారేసరికి మీతో మాట్లాడటానికి నేను సంసిద్ధమయ్యాను. అయితే, కేవలం మాటలతో మిమ్మల్ని సంతృప్తిపరచటం లేదు. మీ మనోభీష్టములను

నెరవేర్చటానికి మీకు ఎంతైనా సహాయం చేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను. చాలామంది నీళ్ళులేక అవస్థపడుతున్నారు. తిండి లేక చాలా అల్లాడుతున్నారు. ఇవి ప్రతి మానవునికి చాలా అవసరమైనటువంటివి. ఈ రెండింటి నిమిత్తమై మీరేమాత్రము యోచన చేయనక్కరలేదు.

దైవము అంత కఠినుడు కాదు; మృదుమధురమైన మనస్సు గలవాడు. మీరెంత బాధపడుతున్నారో మీగురించి అంతకు నూరింతలు బాధపడతాడు స్వామి. కనుక, మీరేమాత్రం బాధ పడకండి. 'ఈ బాధలన్నీ మా మంచికోసమే వచ్చాయి' అనే సద్భావమును మీరు కలిగి ఉంటే పర్వతములవలె వచ్చిన బాధలుకూడను మంచువలె మాయమైపోతాయి. ఈ ప్రాకృతమైన కష్టములు వస్తూనే ఉంటాయి. మీకు మాత్రమే కాదు, కోటీశ్వరునికి కూడా బాధలు తప్పవు. మీ బాధలు అతి శీఘ్రకాలంలోనే నివారణ అయ్యేటట్లు స్వామి ఆశీర్వదిస్తాడు. మీ గ్రామ పెద్దలతోనూ, మీరు కొంత విచారించి చూడండి. ఆ కొండలమధ్యలో, ఆ గుండ్లమధ్యలో మీకు కావలసినంత నీరు లభించేటట్లు చేస్తాను. ఈ చిన్నచిన్న కష్టములకు మీరేమాత్రము లొంగకండి, బాధపడకండి. ఇవన్నీ దేహము ధరించిన ప్రతి వ్యక్తికీ వస్తూనే ఉంటాయి.

దేహమునకు ఎన్ని కష్టములు కలిగినప్పటికీ మనస్సుకు మాత్రం శాంతి కలిగే మార్గాన్ని మీరు వెతకాలి. మనస్సే ఆధారము మానవునకు. మానసిక శాంతి లేనప్పుడు శారీరక సంబంధమైన సుఖములు ఎన్ని ఉన్నప్పటికీ అవన్నీ నిరుపయోగంగా ఉంటాయి. మానసిక శాంతి అనేది ఒక్క దైవచింతనతో తప్ప మరొక మార్గంలో మనకు లభ్యం కాదు. కనుక, ఎన్ని కష్టములు కలిగినప్పటికీ మీరు మానసిక శాంతిని నిలబెట్టుకొనే నిమిత్తమై నిరంతరం భగవన్నామస్మరణ చేయండి. ఇంతకాలం మీరు పడినటువంటి బాధలలో నామ చింతనయే మీకు సంపూర్ణమైన శాంతిని అందిస్తూ వచ్చింది.

## సర్వేశ్వరుని చింతన సర్వచింతలను అణచివేస్తుంది

దైవము దీనులదగ్గరనే ఉంటుంటాడు; బాధలు పడేవారి చెంతనే ఉంటాడు. దైవము ఎక్కడో దూరంగా లేదు. మీ హృదయాల్లోనే, మీ ప్రక్కనే, మీయందే చేరి ఉంటున్నాడు. మీలోనే ఉన్న దైవాన్ని మీరు దూరం చేసుకోకండి. దైవము తప్ప ఏ బంధువూ, ఏ మిత్రుడూ

sri sathyasai vachanamrutam

**2004 ఆగస్టు 23వ తేదీ శ్రీకాకుళంజిల్లా భక్తుల పుట్టపర్తియాత్ర సందర్భంగా ఉదయం సాయికుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం**

మీదగ్గర ఉండేవారు కారు. ఎలాంటి పరిస్థితులందైనా దైవమే మిమ్ములను రక్షిస్తాడు. ఇట్టి దైవత్వమును మరువకుండా ఉన్నవారు భారతీయులు. ఎన్ని శ్రమలు పడినప్పటికినీ దైవచింతనను వదలకుండా ఉండటం చేతనే భారతదేశము అన్ని దేశములకంటే ఎంతో సౌభాగ్యముగా ఉంటున్నది. ఇతర దేశములవారు ఎన్ని సుఖములను అనుభవిస్తున్నప్పటికీ మానసికశాంతిని పొందలేకపోతున్నారు.

మానసికశాంతి భారతీయుల భాగ్యమే! ఇతరులకు ఇట్టి భాగ్యము లభించటం లేదు. భారతీయసంస్కృతి అనాదికాలముగా భారతీయులను ఎన్నియో విధములుగా కాపాడుతూ వచ్చింది. నైతిక బలము మానసికశాంతివలననే లభిస్తుంది. కనుక, మీరు నిరంతరము నామస్మరణ చేస్తూరండి. నిన్న మీరు దైవచింతన చేస్తూ గ్రామమును చుట్టుకొని వచ్చి మన ప్రశాంతినిలయములో పాదము పెట్టినప్పుడు మీ మనస్సునకు ఎంతో శాంతి కలిగింది కదా! కాన, దైవచింతన చేస్తూ, దైవాన్ని మరువకుండా కాలమును సార్థకము చేసుకోండి. మానవునకు ప్రధానమైన లక్ష్యము దైవచింతనే! కాని, కొందరు ఓర్వలేనివారు, దైవచింతనతో వచ్చే లాభమేమిటని ప్రశ్నిస్తుంటారు. అట్టి అసూయాపరులతో మీరేమాత్రము ఏకీభవించక, నిరంతరం దైవచింతన మరువకుండా చూచుకోండి.

మీకు తెలియకపోవచ్చు – ఈ ప్రపంచములో అన్ని దేశములందునూ, అన్ని గ్రామములందునూ జనులు ఎన్నియో అవస్థలు పడుతున్నారు; శారీరక, మానసిక బాధలను అనుభవిస్తూనే ఉన్నారు. ఎన్ని బాధలు సంభవించినా, ఒక్క భారతీయులు మాత్రమే మనస్సును అరికట్టుకొని దైవచింతనతో ఆనందమును అనుభవిస్తున్నారు. మానసిక సుఖశాంతులకంటే ఇతర సుఖములు ఏమాత్రం భద్రమైనవి కావు. మానసిక చింతలు ఒక్క దైవచింతనచేతనే అణిగిపోతాయిగాని, మరి దేనితోనూ అణగిపోవని అన్ని మతములూ బోధిస్తున్నాయి.

*పుట్టుటయే చింత భూమినుండుట చింత*
*సంసారమొక చింత చావు చింత*
*బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత*
*జీవించుటొక చింత చెడుపు చింత*
*కర్మలన్నియు చింత కష్టంబులొక చింత*

sri sathyasai vachanamrutam

2004 ఆగస్టు 23వ తేదీ శ్రీకాకుళంజిల్లా భక్తుల పుట్టపర్తియాత్ర సందర్భంగా ఉదయం సాయికుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం

*సంతసమొక చింత వింత చింత*
*సర్వ చింతలు బాపెడు సాయి భక్తి*
*గొనుడు యికనైన జనులార కోర్కె మీర*
*ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు*
*సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!*

ఇదియే మన సర్వచింతలను బాపే సరైన మార్గము. ఇట్టి దివ్యమైన, భవ్యమైన మార్గమును వదలుకొని అన్యమార్గములో ప్రవేశించి అశాంతిని తెచ్చుకోకండి. కష్టములన్నియు మనకు ఆనందమును అందించే నిమిత్తము ఏర్పడినవేకాని మనలను బాధపెట్టే నిమిత్తము ఏర్పడినవి కాదు. కనుక, కష్టములు వచ్చినా అవి సుఖమును అందించే నిమిత్తం వచ్చినవని మనం భావించుకోవాలి. కాని, ఆ కష్టసమయంలో సుఖమనేది తెలియదు. కాలము గడచినకొలదీ ఆ కష్టములే మనకు సుఖమునందిస్తున్నాయని అర్థమవుతుంది. కష్టముల వలననే మనకు ఆనందము లభ్యమవుతుంది.

ప్రేమస్వరూపులారా! మానవునియందు తరగని ఆస్తి, పెరిగే ఆస్తి ప్రేమ ఒక్కటే. ఎక్కడైనా కూర్చొని భగవంతుని నామాన్ని స్మరిస్తూ ఉంటే వినేవారికి కూడా మానసికశాంతి కలుగుతుంది. పాటలు పాడుతుంటే చంటిపిల్లలకు, జంతువులకు కూడా ఎంతో హాయిగా ఉంటుంది. భగవంతుని నామాన్ని మీరు స్మరిస్తుంటే ఎంతటి కఠిన హృదయమైనా కరిగి ప్రవహిస్తుంది. ఈ విధంగా దైవత్వాన్ని అనుభవించిన భక్తులను గురించి భారతీయ చరిత్రల యందు చదువుతున్నాం, చూస్తున్నాం.

**ఎంత కష్టపడ్డారో అంత సుఖమును పొందుతారు**

మనము ఎక్కడైనా గుంత తీస్తూ పోతుంటే దాని ప్రక్కన ఆ మట్టి అంతా గుట్ట మాదిరి తయారవుతుంది. 'ఇంత పెద్ద గుంత ఉంటున్నదే' అని మనం భయపడ నక్కరలేదు. దానిప్రక్కనే గుట్ట ఉంటుంది. గుంతమట్టే గుట్టమట్టి. గుట్టమట్టే గుంతమట్టి. గుట్టమట్టిని తీసిగుంతలో వేస్తే అంతా సమానమైపోతుంది. అదే విధంగా ఈనాడు మీరు ఎన్ని కష్టములు పడినారో అన్ని సుఖములను కూడా అనుభవిస్తారు. 'అరే! నేను కష్టములనే గుంతలో పడ్డాను. ఇది ఏవిధంగా నేను పూడ్చటం? ఏవిధంగా నేను భరించటం?' అని మీరు బాధపడనక్కరలేదు.

sri sathyasai vachanamrutam

ఆ 'గుంత'ను పూడ్చే యుక్తిని మీరు భక్తిద్వారా అనుభవించాలి.

ప్రేమస్వరూపులారా! మీరెంత ప్రేమచేత ఇక్కడకు శ్రమపడి వచ్చారో అదే ప్రేమచేత మీ స్వస్థానమునకు సుఖముగా చేరుకోండి. అక్కడికి వెళ్ళిన తరువాత మీరు ఈ ఆనందమును అనుభవిస్తుంటే ఆ పడిన 'గుంత'ను మీరు పూడ్చివేసుకోవచ్చును.

*కష్టసుఖములు రెండును కలసియుండు*
*వీని విడదీయనెవ్వరి వశము గాదు*
*సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము*
*కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు.*

కనుక, మనకు వచ్చే కష్టములు సమత్వము నేర్పుటకే వస్తాయి. ప్రేమస్వరూపులారా! మీలో తరగని ఆస్తి ఒక్క ప్రేమయే! ఆ ప్రేమయే భగవంతునియొక్క ప్రాపర్టీ! కనుక, మీరు ప్రేమను పెంచుకోండి. భగవంతుని ప్రేమ మీకు తోడు నీడై మిమ్మల్ని అన్నివిధాల కాపాడుతుంది. మన ఆస్తిపాస్తులన్నీ ధనమువలన ఏర్పడినవని భావించకండి. మన నిజమైన ధనము ప్రేమయే! ప్రేమయే! ప్రేమ తరిగేది కాదు. ఎప్పుడూ పెరుగుతూ ఉంటుంది. ప్రేమతత్త్వాన్ని గుర్తించుకున్న వ్యక్తులు ఈ సత్యాన్ని చక్కగా అర్థము చేసుకోవచ్చు. నిన్నటి దినమున మీరు వీథివీథి తిరిగి పాడిన పాటలచేత హృదయము ఎంతో ఉప్పొంగిపోయింది. కనుక, మీకు దుఃఖము ఏర్పడితే గొంతెత్తి చక్కగా నామస్మరణ చేయండి. ప్రేమతో భగవన్నామాన్ని గానం చేయండి. ఎవరైనా హాస్యము చేస్తారేమోనని భయపడకండి. ఎవరేమనుకున్నా, భయమును దూరము నెట్టి మీరు నామస్మరణ చేయాలి. అప్పుడే మీకు తగిన దైవశక్తి లభిస్తుంది.

ప్రేమస్వరూపులారా! మీరందరూ యిక్కడికి చేరటం నాకెంతో ఆనందాన్ని కల్గిస్తోంది. మీ అందరికీ ఆనందము, సౌఖ్యము, సంతోషము, శాంతి అన్నీ లభించాలని నేను ఎప్పుడూ ఆశిస్తుంటాను. ఈనాడు మీరు ఎనిమిదివేలమంది ఇక్కడికి చేరారు. మీరందరూ క్యాంటీనుకు వెళ్ళి స్వామి ప్రసాదము స్వీకరించండి. సుఖంగా భోజనం చేయండి. అదియే మీకు అక్షయంగా మారిపోయి, మీ కష్టములు, నష్టములన్నీ క్షయమై పోతాయి. ఇక్కడ అన్నీ ఆనందంగా,

sri sathyasai vachanamrutam

ఫ్రీగా లభిస్తాయి. భగవంతుడు కాసుకు లొంగి తన పేరును చెడగొట్టుకోడు. ఎక్కడ డబ్బు చేరుతుందో అక్కడ మలినము ఏర్పడుతుంది. కనుక, స్వామి ఆస్తి అంతా ప్రేమయే. ఈ ప్రేమచేతనే మీరు ప్రాణం నిలుపుకోండి. ఒక్క ప్రేమ మీ వెంట ఉంటే మీ కర్మలన్నీ నివారణైపోతాయి.

ప్రేమస్వరూపులారా! ఇక్కడకు వచ్చినందుకు మీ హృదయాల్లో ప్రేమను నింపుకోండి. పూర్వము 'సింగర్' సాలూరు రాజేశ్వరరావు ఇక్కడకు వచ్చేవాడు. 'చల్లగాలిలో యమునాతటిపై శ్యామసుందరుని మురళి..' అని ఆయన పాడేవాడు.  ఆ పాటలు అందరి హృదయాలను ఉప్పొంగింపజేస్తాయి. అతని కంఠము, అతని భావము ఎంతో మధురమైనవి. అతనియొక్క భావము అతనికే తెలుసు, అన్యులకు తెలియదు. అతని కుమారుడుకూడా ఇప్పుడు ఇక్కడకు వచ్చాడు. సాలూరు రాజేశ్వరరావు, ఆదినారాయణరావు ఇద్దరూ నా దగ్గరకు వచ్చేవారు. వారే సాయిచరిత్రను పాడినవారు. అలాంటి పవిత్రహృదయులు ఎక్కడ ఉండినప్పటికీ వారి సంగీతము సార్థకంగా నిలిచిపోతుంది. సంగీతాన్ని అమ్ముకొని తినేవారికి ఆనందము కల్గదు. కాని, వారెప్పుడూ వ్యాపారమునకు దిగేవారు కాదు; హృదయంలో ఆనందముప్పొంగే విధముగా పాడేవారు. వారు పోయినా వారి కీర్తి మాత్రం శాశ్వతముగా నిల్చిపోయింది.

ఘంటసాల తాను ఎంతో కష్టములో ఉన్నప్పుడు 'స్వామీ! నా కష్టములనుండి దరిచేర్చవా' అని పాడేవాడు. ఆసుపత్రిలో ఉండి 'ఎంతకాలము యీ బాధ? నన్ను ఈ బాధనుండి విముక్తుని గావించవా' అని పాడేవాడు. నేను అతనిని చూడటానికి ఆసుపత్రికి వెళ్ళాను. "ఘంటసాలా! నీవు దీనిగురించి ఏమాత్రము యోచించవద్దు.  నీ హృదయమును పరీక్షించే నిమిత్తము ఈవిధంగా వస్తుంటాయి. దీనిలో నీవు పాస్ కా" అని చెప్పాను. వారు పోయినప్పటికీ వారు చేసిన భగవన్నామస్మరణ శాశ్వతంగా నిల్చి ఉంటుంది.

మనకు శాశ్వతంగా నిలిచే ఆస్తి భగవన్నామస్మరణ ఒక్కటే! మీకు గొంతు ఉండినా లేకపోయినా, స్వరము ఉండినా లేకపోయినా హృదయములో భగవన్నామస్మరణ చేస్తూరండి. అదే గొప్ప పుణ్యముగా వచ్చి మీకు సహాయం చేస్తుంది. నైతికంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా, లౌకికంగా అన్నింటికీ అది మీకు తోడు నీడగా ఉంటుంది.

భగవన్నామస్మరణ కేవలం భక్తిని మాత్రమే కాదు; యుక్తిని, అనురక్తిని, విరక్తిని కూడా

పోషిస్తుంది. దైవము అన్ని విధాలుగా మీకు తోడుగా ఉంటాడు. ఏదైనా యింత పిడికెడు భుజించేటప్పుడు కూడా భగవన్నామస్మరణ చేసి తినండి. భగవన్నామస్మరణ చేస్తూ భుజిస్తే ఆ నామమే మీ హృదయంలో చేరిపోతుంది. కనుకనే, మన పూర్వీకులు భోజనం చేయటానికి ముందు "బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా" అని ప్రార్థించేవారు. మీరు భుజించే ఆహారాన్ని "బ్రహ్మార్పణం..." చేసినప్పుడు తక్షణమే మీలోపలి నుండి జవాబు వస్తున్నది.

"అహం వైశ్వానరో భూత్వాప్రాణినాం దేహమాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః పచా మ్యన్నం చతుర్విధమ్" "నాయనా! నేను నీలోనే వైశ్వానరుని రూపంలో ఉండి నీవు భుజించిన ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాను" అని లోపలినుండి భగవంతుడు చెబుతున్నాడు. అదే రీసౌండ్, రీఫ్లెక్షన్, రియాక్షన్! భగవన్నామము మనకు ఎంతో ఆనందమునిస్తుంది. కనుక, నిరంతరము మీరు నామస్మరణ చేయండి!

(2004 ఆగష్టు 23వ తేదీ శ్రీకాకుళంజిల్లా భక్తుల పుట్టపర్తియాత్ర సందర్భంగా ఉదయం సాయికుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

sri sathyasai vahamrutam